క్లుప్తంగా

అధినేతను కలిసిన ఆడారి ఆనంద్‌కుమార్



పెందుర్తి శారదా పీఠం వార్షికోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

27న శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవం



ముస్తాబవుతున్న ఉత్సవ విగ్రహం

కంచరపాలెం: ఈ నెల 27న గొల్లకంచరపాలెంలోని శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు గోకాడ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఆరోజు వేకువజాము 5 గంటలకు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఉదయం 7 గంటల నుంచి స్వామికి విశేష పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం భజన సంకీర్తన కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు తరలిరావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు కళ్ల సంరక్షణపై శ్రద్ధ అవసరం

ఆరిలోవ: పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు కళ్ల సంరక్షణపై శ్రద్ధ చూపాలని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి చైల్డ్ సైట్ ఇన్‌స్టిట్యూట్ కన్సల్టెంట్ ఆప్తమాలజిస్ట్ అల్లూరి హిమబిందు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యార్థులు డిజిటల్ విధానంలో స్క్రీన్ చూస్తూ అభ్యసిస్తున్నారని, పుస్తకాలను ఎక్కువ సమయం ఒత్తిడితో చదవడం వల్ల కంటికి అలసట వస్తుందన్నారు. దీని ఫలితంగా కళ్లు పొడిబారడం, తల నొప్పి రావడం, దృష్టిలో అస్పష్టత, తలలో పార్శ్వ నొప్పి(మైగ్రేన్) తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. విద్యార్థులు పరీక్షలకు కొద్ది రోజుల ముందు వైద్యులను సంప్రదించి కంటి పరీక్షలు చేయించుకుని, సలహాలు, సూచనలు తీసుకోవాలని ఆమె సూచించారు. విద్యార్థులు చదువుతున్నప్పుడు ప్రతి 20 నిమిషాలకు 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలో పుస్తకంలో అక్షరాలను చూడాలన్నారు. చదువుతున్నప్పుడు తరచూ కంటి రెప్పలు మూస్తూ, తెరుస్తుండాలన్నారు. ఎయిర్ కండిషన్, కూలర్లు, ఫ్యాన్లకు ఎదురుగా ఉండి చదవకూడదని, గాలి, వెలుతురు బాగా ఉండే గదులలో చదవాలని ఆమె సూచించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



సీతారాములకు పూజలు చేస్తున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష దంపతులు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో బుధవారం సీతారాములు కల్యాణం, పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి గణపతి పూజ అనంతరం కల్యాణం, పట్టాభిషేకం 1.30 గంటల వరకు జరిపారు. ఆలయంలో ఈ నెల 12 నుంచి 21 వరకు పది రోజుల పాటు శ్రీమద్రామాయణ పారాయణం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష దంపతులు సీతారాములను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో డిజిటల్ సేవలు

- బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీలో ప్రత్యేక ఏర్పాట్లు
- ఒక్క క్లిక్‌తో రోగి సమస్త సమాచారం
- పాత కేస్ షీట్లతో పని లేకుండానే సులువుగా వైద్యం

జగనన్న సర్కార్ పేదలకు అందించే సేవల్లోనూ సరికొత్త సాంకేతిక పద్ధతులను అనుసరిస్తోంది. వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రులకు వెళ్లేటప్పుడు రోగి కేస్ హిస్టరీ పరిశీలించటం వల్ల కాలయాపన జరుగుతుందని ఆస్పత్రులను డిజిటలైజేషన్ చేస్తున్నారు. బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీలో ఈ తరహా సేవలు అందుబాటులోకి రావటంతో ఒక్క క్లిక్‌తో రోగుల వివరాలు తెలుసుకుని సులువుగా వైద్యం చేసే వీలు చిక్కుతోంది. రోగికి నిరీక్షించే పని లేదు.. వైద్యుడికి పాత కేస్ షీట్లు పరిశీలించాల్సిన అవసరం లేకుండానే సత్వర సేవలకు వీలు కలుగుతోంది. దీంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ విద్య : రోగులకు మెరుగైన వైద్యం అందించటమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. ఆస్పత్రులను బలోపేతం చేసే క్రమంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. ఇదే క్రమంలో వైద్య సేవలను మరింత విస్తృత పరిచేలా ప్రభుత్వాస్పత్రుల్లో డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఆస్పత్రుల్లో సేవలు పొందేందుకు వచ్చే వారి సమగ్ర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీని వల్ల మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి.



జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో ఏర్పాటు చేసిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ఎనిమిది సచివాలయాల పరిధిలోని 8,680 గృహాలకు సంబంధించి 27 వేల మందికి వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేశారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటంతో 52, 90 వార్డుల పరిధిలోని కాలనీల నుంచి రోగులు సేవలు పొందేందుకు వస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు. సేవల కోసం ఆస్పత్రికి వచ్చిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వారి ఆధార్ కార్డు అనుసంధానంతో ప్రత్యేక గుర్తింపు సంఖ్య ద్వారా వారి వివరాలు పొందుపరుస్తున్నారు.



బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ

మెరుగైన వైద్యమే లక్ష్యం..

వైద్యం కోసం వచ్చే వ్యక్తి గతంలో ఏ రకమైన వ్యాధితో బాధపడ్డాడు.. ఏ ఆస్పత్రిలో ఎటువంటి చికిత్స పొందాడు.. ఏదైనా ప్రభుత్వ పథకం ద్వారా చికిత్స తీసుకున్నాడా అనే వివరాలు నమోదు చేస్తున్నారు. దీని వల్ల ఏదైనా అనారోగ్య సమస్యతో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లినప్పుడు పాత వివరాలు పరిశీలించాల్సిన అవసరం లేకుండానే ఆధార్ కార్డుతో అనుసంధానం చేసిన ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో ఐడీ ఓపెన్ చేసి, తగిన వైద్య సేవలు అందించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

తగ్గనున్న పరీక్షల భారం..

ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. మలేరియా, డెంగ్యూ, షుగర్ వంటి పరీక్షలతో పాటు కిడ్నీ సంబంధిత వ్యాధుల పరీక్షలు సైతం చేసేలా అధునాతన వైద్య పరికరాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. పరీక్షల అనంతరం ఫలితాలను సకాలంలో అందజేస్తుండడటంతో ఆ వివరాలను ఆస్పత్రి సిబ్బంది ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఆస్పత్రికి వెళ్లిన ప్రతిసారి రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకునే అవసరం ఉండదు. దీని వల్ల చికిత్స సులువవుతుంది.

సత్ఫలితాలు వస్తున్నాయి..



ఆస్పత్రికి వచ్చే రోగులకు సత్వరమే తగిన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నాం. రోగుల వివరాలు డాటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నాం. దీని ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. ఇటువంటి ఏర్పాట్ల వల్ల రోగులకు సత్వరమే మెరుగైన వైద్యం అందుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా అంతా సమన్వయంతో పని చేస్తూ, రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ రొంగలి రేవతి, యూపీహెచ్‌సీ వైద్యాధికారి



సేవలు అందిస్తున్న డాక్టర్ రేవతి



వివరాలు ఆన్‌లైన్ చేస్తున్న డీఈవో సంతోషి



రక్త పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

డీఈవో ఆకస్మిక తనిఖీ



త్రినాథపురం పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈవో చంద్రకళ

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జిల్లా విద్యాధికారి చంద్రకళ ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించి, వాటిని చదివించారు. విద్యార్థులకు పలు సూచనలిచ్చిన డీఈవో.. వారి హాజరుపై ఆరా తీశారు. విద్యార్థుల పుస్తక పఠనం తీరుపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ మన జిల్లా మొదటి స్థానం పొందే అవకాశం ఈ పాఠశాలకు ఉందని పిల్లలను, ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. అనంతరం విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండేలా చూడాలని ప్రధానోపాధ్యాయిని రమణికుమారికి డీఈవో సూచించారు. మండల విద్యాధికారులు త్రినాథరావు, ఎల్.వెంకటరావు, సీఆర్పీలు డి.కృష్ణారావు, సిహెచ్.సునీత, పి.ఈశ్వరరావు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతృభాషతోనే మానవ వికాసం



విద్యార్థులతో అతిథులు, అధ్యాపకులు

కంచరపాలెం: మానవ వికాసం, మనుగడ మాతృభాషతోనే సాధ్యమని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అన్నారు. జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి, అంతర్ కళాశాలల అకడమిక్ నేతృత్వంలో విద్యార్థులకు మాతృభాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షైజీ మాట్లాడుతూ మాతృభాషలో పట్టు సాధించిన విద్యార్థులు విద్యారంగంలో బాగా రాణిస్తారని తెలిపారు. డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల సృజనకు పదును పెడుతూ నిర్వహించిన పోటీలు భవిష్యత్తుకు బాటలు వేస్తాయన్నారు. సుమారు 12 కళాశాలలకు చెందిన విద్యార్థులు వేడుకల్లో భాగస్వాములయ్యారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ వీణా స్పందన, సిస్టర్ జైన్ థామస్, డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్. దీప్తి, డాక్టర్ గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ట్రస్ట్‌బోర్డ్ ప్రమాణ స్వీకారం



సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన సత్యనారాయణస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు టర్నర్‌చౌల్ట్రీ నుంచి ఆలయం వరకు ర్యాలీ చేపట్టారు. కోలాటం, మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ర్యాలీ సాగింది. ఆలయ ఈవో బుద్ధ నాగ జగదీష్, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రసిద్ధి చెందిన సత్యనారాయణ స్వామి దేవస్థానం ప్రతిష్ట మరింత పెంచే విధంగా అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలని సూచించారు. పెంటపల్లి వెంకట్, చింతపల్లి సత్యవతి, బెవర దేవి మహేష్, చిన్నా శ్రీధర్, బైరా అశోక్, మానేపల్లి రమణి, బుడ్డిగ మాధవి, ఫణిహార నరసింహమూర్తితో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు.

అనంతరం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొరిపల్లి ఆనంద్ మాట్లాడుతూ కష్టపడిన వారిని గుర్తించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తామంతా కలిసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, 36వ వార్డు నాయకుడు మాసిపోగు రాజు, 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, పెంటపల్లి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు పీతల వాసు, జెర్రిపోతుల ప్రసాద్, వడ్డాది దిలీప్, నీలాపు లక్ష్మి, దశమంతుల మాణిక్యాలరావు, సనపల రవీంద్ర, కాకి పద్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారికి పుష్పయాగం



వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన పూలను శ్రీవారికి నివేదించిన దృశ్యం

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చక్రత్తాళ్వార్‌తో భక్తుల అప్పుఘర్ తీరంలో సముద్ర స్నానం చేసి తరించారు. అనంతరం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో శ్రీవారికి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పుష్పాలు తొలుత స్వామి వారికి నివేదించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సామెతలు, జాతీయాలు గొప్ప సంపద



మాట్లాడుతున్న డాక్టర్ డి.వి.సూర్యారావు

సీతంపేట: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో 'తెలుగు పలుకుబడులు, వైచిత్రి' అనే అంశంపై రచయిత, డాక్టర్ డి.వి.సూర్యారావు ప్రసంగించారు. తెలుగు భాషకు సామెతలు, జాతీయాలు గొప్ప సంపదని అభివర్ణించారు. తెలుగు జాతికి, తెలుగు భాషకు సొంతమై పరభాషలోకి అనువదించి చెప్పలేనివి ఆ జాతి సంస్కృతిని ప్రతిబింబించేవి జాతీయాలుగా పేర్కొన్నారు. ఇంచుమించుగా వాటినే పలుకుబడులుగా పరిగణిస్తామన్నారు. కొన్ని పదబంధాలలో ఇమిడి ఉన్న అర్థాలను వివరించారు.

పార్టీ శ్రేణులు, అభిమానుల సందడి



90వ వార్డు పవర్ హౌస్ వద్ద స్వాగతం పలుకుతున్న నమ్మి శ్రీను, మహిళలు



కళాకారులతో కలిసి స్వాగతం పలుకుతున్న జియ్యాని శ్రీధర్, బీఎస్ కృష్ణ



స్వాగతం పలికేందుకు వేచి ఉన్న 62వ వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు, పార్టీ శ్రేణులు

గోపాలపట్నం/విశాఖ విద్య: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బుధవారం నగరంలో ఘన స్వాగతం లభించింది. పెందుర్తి చిన ముషిడివాడలోని శ్రీ శారదా పీఠం సందర్శనకు వచ్చిన సీఎంకు దారి పొడవునా వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, పెద్ద సంఖ్యలో మహిళలు స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గోపాలపట్నం బంకు జంక్షన్ నుంచి ఆర్‌ఆర్ వెంకటాపురం వరకు 89, 90, 91, 92 వార్డుల నుంచి మహిళలు, నాయకులు, కార్యకర్తలు హాజరై సందడి చేశారు. ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం వరకు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో అభిమానులు, మహిళలు, కార్యకర్తలు హాజరయ్యారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి కాకానినగర్, ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్, బాజీ జంక్షన్ ఇలా చినముషిడివాడ వరకు రోడ్డుకు ఇరువైపులా జనం క్యూ కట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫ్లెక్సీలు చేతపట్టి, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాకానినగర్ సెంటర్‌లో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, విశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.ఎస్.కృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించి, ప్రజానీకంతో కలిసి సీఎంకు స్వాగతం పలికారు. ఇదే చోట కళాకారులు వివిధ వేషధారణలో సీఎంకు స్వాగతం పలికిన తీరు అందరినీ ఆకట్టుకుంది. వైఎస్సార్‌సీపీ 90వ వార్డు నాయకుడు నమ్మి శ్రీను ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు రోడ్డుపై నిలబడి సీఎం.. సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, పార్టీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతం నుంచి భారీగా..

సింధియా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ ఎయిర్‌పోర్ట్ వద్ద 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలు ఘన స్వాగతం పలుకుతూ జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. 62వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ కమిటీల సభ్యులతో కలిసి ర్యాలీగా వెళ్లి సీఎంకు స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ 63వ వార్డు ఇనాచార్జి పిలక రామ్మోహన రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు. 60వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి పత్సారావు నేతృత్వంలో నాయకుడు జిమ్ శ్రీను ఆధ్వర్యంలో సుమారు 100 బైకులతో కార్యకర్తలు, యువకులు ర్యాలీగా వెళ్లి విశాఖ ఎయిర్‌పోర్ట్ వద్ద సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. సీఎం కాన్వాయ్ వెంట శ్రీశారదా పీఠం వరకు ర్యాలీగా వెళ్లి జై జగన్ నినాదాలతో హోరెత్తించారు.



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు, కార్యకర్తలు



92వ వార్డు బెహరా ఆస్పత్రి వద్ద వేచి ఉన్న బెహరా భాస్కరరావు, కార్యకర్తలు



గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు

పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమం



పాఠశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు చుక్కవానిపాలెం ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో గాజువాక ఆదిత్య కళాశాల విద్యార్థులు పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కళాశాల విద్యార్థులు తుంగ్లాంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కౌన్సెలింగ్ చేశారు. నిత్యం పాఠశాలకు రావాలని, పరిశుభ్రత పాటించాలని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని.. తదితర అంశాలను వివరించారు.

మానవ మనుగడకు వారధి భాష



ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి


ఏయూ క్యాంపస్: మానవ మనుగడకు వారధి భాష అని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఏయూ తెలుగు విభాగంలో సమైక్యభారతి, ఆంధ్రభవన్ సంయుక్తంగా ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా మాతృభాష దినోత్సవం–తెలుగు భాష విశిష్టత అంశంపై నిర్వహించిన సదస్సును వీసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏ జీవికీ లేని సౌలభ్యం, ప్రత్యేకత భాష రూపంలో మానవులకు లభించిందన్నారు. తన ఉన్నతికి, ఇతర భాషలను అభ్యసించడం అవసరమన్నారు. మాతృభాషను గౌరవించడం, సంరక్షించడం ప్రధానమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి పాఠ్య పుస్తకాలను విద్యార్థుల సౌలభ్యం కోసం ద్విభాషా ముద్రణ జరిపి అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఇటువంటి నూతన ప్రక్రియలతో ఆంధ్రప్రదేశ్‌ని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుపుతున్నారన్నారు.

బీచ్ రోడ్డు: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం కృష్ణా కళాశాలలో ఘనంగా నిర్వహించారు. మొదటగా తెలుగు తల్లి చిత్రపటానికి విద్యార్థులు, అధ్యాపకులు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. మా తెలుగు తల్లికి మల్లెపూదండ పాటను ఆలపించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు మాట్లాడుతూ మనం మొదటిగా నేర్చుకున్న భాష మాతృభాష అని, తన తల్లిని ఎవరూ చెప్పకుండానే అమ్మా అని బిడ్డ ఎలా పిలుస్తాడో మాతృభాష కూడా అంతే అన్నారు. మాతృభాష సహజంగా అబ్బుతుందని, అప్రయత్నంగా వస్తుందని చెప్పారు. అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలన్నారు.

గ్రంథాలయంలో..

ఎంవీపీ కాలనీ: స్థానిక శాఖా గ్రంథాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ అధికారి ఉమామహేశ్వరరావు.. సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జేకే స్కూల్ విద్యార్థులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య



ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లకు సూచనలిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డ్ ఆర్ఐవో మురళీధర్

సీతంపేట: విద్యార్థులకు ఒత్తిడి లేకుండా విద్యను అందించాలని ఇంటర్మీడియట్ బోర్డ్ ఆర్ఐవో మురళీధర్ అన్నారు. ఇంటర్మీడియట్ బోర్డ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీవిశ్వ కళాశాలలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్, ఆత్మహత్యల నివారణ అంశంపై కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్స్, జేఎల్స్‌కు జరిగిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ తగు జాగ్రత్తలు వహించాలన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురైనట్టు కనిపిస్తే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఆత్మస్థైర్యం కలిగించాలని సూచించారు. ఇటీవల కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు చోటుచేసుకున్న కారణంగా ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఉపక్రమించిందన్నారు. ట్రైనర్ జి.రవి, శ్రీవిశ్వ డైరెక్టర్ సూర్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్ పాల్గొన్నారు.